

## 60 కోట్ల భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానం

**మహాకుంభ్‌నగర్, ఫిబ్రవరి 22:** ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభ్‌మేళాలో 41 రోజుల వ్యవధిలోనే సుమారు 60 కోట్లమంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారనియుపిసీఎం యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. మేళా ముగింపునకు వస్తుండటంతో భక్తుల రద్దీ మరింతపెరిగింది. రానురాను వెల్లువలా భక్తులు వస్తుండటంతో 65 కోట్లకు భక్తులసంఖ్య చేరుకుంటుందని యోగి ప్రభుత్వం అంచనా. చివరిరోజయిన ఫిబ్రవరి 26న రెండుకోట్లమంది భక్తులు వస్తారని యుపి ప్రభుత్వం అంచనావేస్తోంది. మహాకుంభ్‌శక్తిని ప్రపంచం కీర్తిస్తోందని యోగి ఆదిత్యనాథ్ అన్నారు. మనరాష్ట్ర సామర్థ్యం, అభివృద్ధిపై నమ్మకంలేనివారు కుంభ్‌మేళాపై బురదజల్లేప్రయత్నంచేస్తున్నారన్నారు. కాగా జనవరి 13న ప్రారంభించిన ఈ మహాకుంభ్‌మేళా 26వరకూ కొనసాగుతుంది. మొత్తం 45 కోట్లమంది రావచ్చని వేసిన అంచనాలు కూడా దాటిపోయాయి. ప్రతిరోజు సగటున కోటిన్నరమందివరకూ వస్తున్నట్లు అధికారులుచెపుతున్నారు. ఒక్క మౌని అమావాస్యరోజునే 8 కోట్లమంది పుణ్యస్నానాలు ఆచరించారని యుపి సర్కారు ప్రకటించింది. ఇదిలా ఉండగా ప్రయాగరాజ్ కుంభమేళాలో బిజెపి జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్యమంత్రి జెపినడ్డా త్రివేణి సంగమంలో పుణ్యస్నానంచేసారు. పుణ్యస్నానం అనంతరం ఆయనప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోడీ, హోంమంత్రి అమిత్‌షాతోసహా పలువురు కేంద్రమంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేసారు.

## వెటర్నరీ వర్సిటీ విసిగా జ్ఞానప్రకాశ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా డాక్టర్ మంథని జ్ఞానప్రకాశ్ నియమితులయ్యారు. ఈ మేరకు దీనికి సంబంధించి గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీసీగా జ్ఞానప్రకాశ్ మూడేండ్ల పాటు కొనసాగుతారు. వరంగల్ జిల్లా హసన్‌పర్తికి చెందిన జ్ఞానప్రకాశ్ యానిమల్ జెనెటిక్స్ అండ్ బ్రీడింగ్ విభాగంలో ప్రొఫెసర్, కంట్రోలర్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, రిజిస్ట్రార్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు.

## ప్రజా భవన్‌లో విహెచ్ వర్సెస్ అంజన్‌కుమార్‌యాదవ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 22:** ప్రజా భవన్‌లో శనివారం బీసీ సంఘాలతో కులగణన సర్వేపై సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించిన సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత అంజన్‌కుమార్ యాదవ్,మాజీ పిసిసి చీఫ్,మాజీ ఎంపీ వి.హనుమంతరావు మధ్య మాటల యుద్ధం నడిచింది. 'నీ ముఖానికి ఎప్పుడైనా ఎన్నికల్లో గెలిచావా? అంటూ అంజన్‌కుమార్... విహెచ్‌ను ప్రశ్నించారు. దీనికి వెంటనే విహెచ్ మీ కుటుంబానికి మంచి పదవులు ఎంపీ, వర్కింగ్ ప్రెసిడెంట్ తెచ్చుకున్నావు అని విహెచ్ బదులిచ్చారు. 'ఎలక్షన్ ద్వారా నా కొడుకు యువజన కాంగ్రెస్ ప్రెసిడెంట్ అయ్యాడని, అదేం నామినేటెడ్ పోస్టు కాదని అంజన్ కుమార్ సీరియస్ అయ్యారు. అనిల్ సేవలను గుర్తించి పార్టీ రాజ్యసభ సీటు ఇచ్చిందని చెప్పారు. నా వరకొస్తే రెండు ఎలక్షన్లలో పోటీ చేసి గెలిచిన అంజన్‌కుమార్‌ది అని విహెచ్‌కు గట్టిగా చెప్పారు. ఒక దశలో విహెచ్,అంజన్‌కుమార్ పరస్పరం ఒకరిపై ఒకరు ఫైర్ అయ్యారు. దీంతో మంత్రి పొన్నం ప్రభాకర్ కలుగజేసుకొని ఇక్కడ భేటీ అయిన సందర్భం వేరు. టాపిక్ డైవర్ట్ అవుతుందని సర్ది చెప్పడంతో ఇరువురు నేతలు మౌనం వహించారు. కులగణనపై నేతలు తమ అభిప్రాయాలు తెలియజేసే క్రమంలో విహెచ్ బీసీ కులాల గురించి ప్రస్తావించి ముగించారు. ఇందులో యాదవ కులం గురించి మాట్లాడకపోవడం మరిచిపోయారు. దీంతో అంజన్‌కుమార్ స్పందిస్తూ ప్రతి ఒక్కరూ మమ్మల్ని మరిచిపోతే ఎలా? అని వ్యాఖ్యానించడంతో ఈ గొడవకు దారి తీసినట్లు తెలిసింది. పిసిసి చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,బీసీ సంఘాలు,అనుబంధ సంఘాల నేతల సమక్షంలోనే ఈ ఘటన చోటుచేసుకోవడం అంతా షాక్ అయ్యారు.

## విద్యావ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకుంటాం

### సిఎం రేవంత్‌రెడ్డికి నివేదికను అందజేసిన విద్యా కమిషన్ చైర్మన్, సభ్యులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 22:** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతోపాటు, విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. విద్యా కమిషన్ చైర్మన్, సభ్యులతో జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సాయంత్రం సమీక్ష చేశారు.ఈ సమీక్షకు సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి,కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు హాజరయ్యారు.రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బలోపేతంపై కమిషన్ రూపొందించిన నివేదికను ముఖ్యమంత్రికి కమిషన్ చైర్మన్, సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వర్ రావు, చారగొండ వెంకటేష్, జ్యోత్స్న శివారెడ్డి, తదితరులు అందజేశారు.రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్‌తో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను ముఖ్యమంత్రి దృష్టికి కమిషన్ చైర్మన్,సభ్యులు తీసుకెళ్లారు.విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు నియోజకవర్గాలవారీగా తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి సమగ్ర విధానాలను రూపొందించాలని కమిషన్‌కు సిఎం రేవంత్‌రెడ్డి సూచించారు.



## ప్రొటీన్స్ ఎక్కువగా ఉండే గుడ్డు, చికెన్‌ను తినాలి

### పౌల్ట్రీ బ్రీడర్స్ కో-ఆర్డినేషన్ అసోసియేషన్ ప్రతినిధులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** పౌల్ట్రీ బ్రీడర్స్ కో-ఆర్డినేషన్ అసోసియేషన్, జాతీయ కోడిగుడ్ల సమన్వయ సమితి ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఓల్డ్ అల్వాల్, బోయిన్‌పల్లి, నాంపల్లి, అత్తాపూర్, సరూర్‌నగర్, హయత్‌నగర్, మన్సూరాబాద్, కామారెడ్డిలో రామాయంపేట్, వరంగల్‌లో హన్మకొండ, నర్సాపూర్‌లో ప్రగతినగర్, కల్వకుర్తి మార్కెట్ ఏరియా, ఆర్మూర్‌లో కమరపల్లి మెయిన్‌రోడ్, నల్గొండలో రామగిరిరోడ్, సిరిసిల్ల అంబేద్కర్ స్టేట్యూ, జహీరాబాద్ మార్కెట్ ఏరియా, గజ్వేల్ ఆర్‌టిసి బస్టాండ్, పరిగి బాహర్‌పేట, చేవెళ్ళ మొయినాబాద్ ప్రాంతాల్లో చికెన్, గుడ్లమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా చికెన్‌పై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను కొట్టిపారేస్తూ వండిన చికెన్, కోడిగుడ్లను ప్రజలకు అందజేశారు.

# 68 కిలోల బంగారంతో విమాన గోపురం

### యాదగిరిగుట్ట ఆలయంలో నేడు ఆవిష్కరణ

### హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 22:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ దివ్య విమాన స్వర్ణ గోపురం మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ విమాన గోపురం స్వర్ణమయంగా మారింది. విమాన గోపురానికి బంగారు తాపడం పనులు ముగిశాయి. ఆదివారం ఆలయ సంప్రోక్షణ, మహా కుంభాభిషేకం ఘట్టం నిర్వహించి బంగారు విమాన గోపురాన్ని స్వామివారికి అంకితం ఇవ్వనున్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా విమాన గోపురానికి బంగారు తాపడం చేయించాలని 2021లో అప్పటి సీఎం కేసీఆర్ నిర్ణయించారు. అనేక మంది భక్తులు, దాతలు విరాళాలు ఇచ్చినా తాపడం పనులు చేపట్టేందుకు అవసరమైన బంగారం సమకూరలేదు. ఆ తర్వాత 2022 మార్చి 8న కేసీఆర్ ఆలయ ఉద్ఘాటన పూర్తి చేశారు. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి యాదగిరిగుట్ట అభివృద్ధిపై దృష్టి సారించారు. పనులపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఉమ్మడి జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డితో సమీక్షలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 11.54 గంటలకు జరిగే మహత్తరమైన ఘట్టానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెళ్లనున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవెల్లిలోని ఆయన నివాసంలో కలిసిన అర్చకులు ఆహ్వాన పత్రికను అందజేశారు.మార్చి 1 నుంచి 11 వరకు జరిగే యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాల్సిందిగా కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు పలువురు ప్రముఖులను ఆలయ పూజారులు ఆహ్వానించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి విమాన గోపురాన్ని స్వర్ణమయంగా తీర్చిదిద్దారు. యాదగిరిగుట్ట ఆలయ రాజగోపురం 50.5 ఫీట్ల ఎత్తులో సుమారు 10,759 ఎస్‌ఎఫ్‌టీలుగా ఉంది. బంగారు తాపడం కోసం ఒక్కో ఎస్‌ఎఫ్‌టీకి 6 గ్రాముల చొప్పున మొత్తం 68 కిలోల బంగారాన్ని ఉపయోగించారు. ఇందుకోసం సుమారు రూ.80 కోట్లకు పైగా ఖర్చు చేశారు.

## ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ ప్రమాదానికి పూర్తి బాధ్యత రేవంత్‌రెడ్డిదే

### మాజీమంత్రి కెటిఆర్




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 22:** ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ వద్ద జరిగిన ప్రమాదానికి పూర్తి బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు.సుంకిశాలలో రీటైనింగ్ వాల్ కుప్పకూలిన ఘటన మరువకముందే రాష్ట్రంలో మరో దుర్ఘటన జరగడం కాంగ్రెస్ సర్కారు వైఫల్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.కాంట్రాక్టర్లతో కుమ్మక్కై కమీషన్ల వేటలో పర్యవేక్షణను గాలికొదిలేయడం, నాణ్యతా ప్రమాణాల విషయంలో పూర్తిగా రాజీపడిపోవడం వల్లే ఇలాంటి వరుస సంఘటనలు జరుగుతున్నాయన్నారు. పైకప్పు కూలిన ఈ ఘటనలో లోపల ఎవరైనా చిక్కుకుని ఉంటే వారిని క్షేమంగా బయటకు తీసుకువచ్చేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఈ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి వారి ప్రాణాలు కాపాడాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కమీషన్లకు కక్కుర్తి పడకుండా నిబంధనల మేరకు పనులు జరిగేలా చూడాలని చెప్పారు.కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఒక బ్యారేజీలో కేవలం పిల్లర్ కుంగితే నానా హంగామా చేసిన కాంగ్రెస్ నేతలు తమ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న ఈ వరుస వైఫల్యాలపై ఇప్పుడే మంటారని ప్రశ్నించారు. సుంకిశాల ప్రమాదంలో కాంట్రాక్టర్‌ను కాపాడేందుకు వాస్తవాలు దాచిపెట్టిన ప్రభుత్వం, కనీసం ఎస్‌ఎల్బీసీ సంఘటనపైనైనా పారదర్శకంగా దర్యాప్తు జరిపి ప్రమాదానికి గల కారణాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

## షీర్‌జోన్‌లో తవ్వకాల వల్లే ఎస్‌ఎల్‌బిసి సొరంగ ప్రమాదం

### నిమిషానికి 30వేల లీటర్లకు మించి ఉబికి వచ్చిన బురదనీరు

### పాలియురేతేన్ గ్రౌట్ నిలువరించపోవడంతో కుప్పకూలిన సొరంగం పైకప్పు

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** షీర్ జోన్ కారణంగా శ్రీశైలం ఎడమగట్టు ప్రమాదం సంభవించి ఉంటుంది. శ్రీశైలం ఎడమగట్టు దోమలపెంట ఇన్‌లెట్ సొరంగంలో తొలిచే పనులు "షీర్‌జోన్" (పెళుసైన రాళ్ళతోకూడిన బురద ప్రాంతం)లో అత్యంత ప్రమాదకర పరిస్థితులతో పోటిపడుతూ తొలుస్తుండగా మూడు మీటర్ల మేరకు పై కప్పు కిందపడి భారీ ప్రమాదం శనివారం సంభవించింది. దోమలపెంట ఇన్‌లెట్‌లో టన్నెల్ బోర్‌వెల్ మిషన్‌తో జనవరి 30న ట్రయల్ రన్ పనులు నిర్వహించగా నిమిషానికి పదివేల లీటర్ల బురదనీరు సొరంగం పైనుంచి కిందివరకు ఉబికిరావడం గమనించారు.సుమారు 18మీటర్ల వరకు అత్యంత పెళుసైన,కోతకుగురయ్యే డక్టిల్‌షీర్ జోన్ ఉండటంతో పాలియురేతెన్ గ్రౌట్ చేస్తూ వెంటవెంటనే బురదనీటిని నిలిపి తొలిచే పనులు ముందుకు తీసుకెళ్ళాలని నిపుణులు నిర్ణయించారు. 18 మీటర్ల వరకు 74 ఎంఎం హోల్స్‌వేసి 32ఎంఎం స్టీల్‌రాడ్ ఉపయోగించి గ్రౌట్ చేయాలని ట్రయల్‌రన్ సందర్భంగా నిపుణులు నిర్ణయించుకొన్నట్లు తెలిసింది. గత వారం రోజులుగా దాదాపు 20మీటర్ల వరకు తవ్వుతూ పాలియురేత్‌గ్రౌట్ చేస్తూ ఉన్నారు.శనివారం ఉదయం ఎనిమిది గంటలకు సొరంగంలో పనులు నిర్వహిచడానికి వెళ్ళిన కార్మికులు టన్నెల్ బోరింగ్ మిషన్ ఆన్‌చేశారని తెలిసింది.పాలియురేతేన్ గ్రౌట్ నిలువరించపోవడంతో నీరు మట్టి లీక్ అవడంతో మూడ మీటర్ల వరకు ప్రికాస్ట్‌సెగ్మంట్‌లైనింగ్ కుప్పకూలిపోయినట్లు అందులోంచి బయటపడ్డ కార్మికులు తెలిపారు. టీబీఎం ఆపరేటర్ ప్రమాదాన్ని ముందే పసిగట్టారు. టన్నెల్ బోరింగ్ మిషన్ వెనుక ఉన్న 42 మంది బయటికి పంపారు. టన్నెల్ లోపల 8 మంది చిక్కుకున్నారు.

టన్నెల్‌లో యూపీ, ఝార్ఖండ్ వాసులు చిక్కుకున్నారు. మిషన్‌కు ముందున్న 8 మంది లోపల చిక్కుకున్నారు. టన్నెల్‌లో యూపీ, ఝార్ఖండ్ వాసులు చిక్కుకున్నారు. ఇద్దరు ఇంజినీర్లు, ఇద్దరు మిషన్ ఆపరేటర్లు, నలుగురు కూలీలు ఉన్నారు. 8 మందిని ప్రాణాలతో రక్షి ంచేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నాం. 14 కిలోమీటర్ల లోపల ఉన్నందున సహాయకచర్యలు క్లిష్టంగా మారాయి. టన్నెల్‌లో చిక్కుకున్న వారిని రక్షి ంచేందుకు 3ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. విజయవాడ నుంచి 2, హైదరాబాద్ నుంచి వచ్చిన ఒక ఎన్డీఆర్‌ఎఫ్ బృందం రంగంలోకి దిగింది. రాత్రికి భారత సైన్యం కూడా చేరుకుంటుందని మంత్రి ఉత్తమ్ తెలిపారు. లోపల 8 మంది బతుకున్న సమాచారం ఇప్పటివరకు తెలియదని మంత్రి పేర్కొన్నారు. సొరంగ ప్రమాదాల్లో దేశంలో కీలకమైన నిపుణుల సహకారంతోబాధితులను రక్షి ంచే దుకు కృషి చేస్తున్నారు. ఎస్‌ఎల్‌బిసి ఔట్‌లెట్ పనులు టిబిఎం మరమ్మతుకు గురికావడంతో దశాబద కాలంగా నిలిపివేశారు. అమెరికా నుంచి బేరింగ్‌లు ఇండియాకు రావడంతో మన్నెవారిపల్లి నుంచి కూడా ఔట్‌లెట్ పను లు

## మేడిగడ్డ మరమ్మతులు వెంటనే చేపట్టాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి మాజీ ఎంపి వినోద్ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 22:** మేడిగడ్డ బరాజ్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టాలని మాజీఎంపీ వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. కాలయాపన చేయకుండా పనులు ప్రారంభించాలన్నారు. ఇప్పటికే వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని చెప్పారు. మేడిగడ్డతో సంబంధం లేకుండా ప్రాణిహిత నుంచి నీటిని ఎత్తిపోసి.. పంటలను కాపాడేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శనివారం బహిరంగ లేఖ రాశారు.నీళ్ల ఇవ్వలేమని చెప్పడం ప్రభుత్వ వైఫల్యమే.శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టుకు యాసంగి పంటకు మీరు నీళ్ల ఇవ్వలేమని గత డిసెంబర్‌లో అధికారులతో ప్రకటన చేయించారు. తాజాగా రైతు సమితి చైర్మన్ కోదండరెడ్డి పంటలు వేయొద్దని రైతులకు సూచనలు చేస్తున్నారు. ఇది ఎలా ఉందంటే చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఉన్నదని లేఖలో పేర్కొన్నారు.వేసవి పంటల కోసం ఉత్తర తెలంగాణ రైతులకు నీళ్ల ఇవ్వలేమనటం మీ ప్రభుత్వ వైఫల్యమే,కాళేశ్వరం ప్రాజెక్టు లేకపోయినా పంట దిగుబడి సాధించామని మీ మంత్రులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తున్నారు. కాళేశ్వరం అంటే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు మాత్రమే కాదు, కాళేశ్వరం మేడిగడ్డ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాలో బస్వాపూర్ వరకు ఉన్న అనేక ప్రాజెక్టులు, బ్యారేజీలు, రిజర్వాయర్లు, పంప్ హౌజ్ల సంగమం. ఒక బ్యారేజీలు నీళ్ల నిల్వ చేయకపోయినా మిగతా ప్రాజెక్టుల ద్వారా రైతులకు నీళ్ల అందుతున్నాయన్న విషయాన్ని మర్చిపోవటం హాస్యాస్పదం. అది కాళేశ్వరం ప్రాజెక్టులో నీటి సరఫరా వ్యవస్థపై మీకు, మీ నాయకులకు అవగాహన లేమికి నిదర్శనం. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పేరుతో అప్పటి వైఎస్ ప్రభుత్వం దోసిళ్లతో నీళ్ల ఒడిసిపట్టే ప్రయత్నం చేస్తే కేసీఆర్ ప్రభుత్వం అనేక రిజర్వాయర్లతో కాళేశ్వరాన్ని పెద్ద నీటి తాంబాలంగా మార్చారని పేర్కొన్నారు. కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ తొలి ప్రభుత్వం గత పదేండ్లలో రికార్డు స్థాయిలో వరి దిగుబడిని పెంచితే.. మీరు అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే కనీసం పంటకు నీళ్ల ఇవ్వలేని దుస్థితిని తీసుకువచ్చారు. మరమ్మతులకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అనుమతులకు సంబంధం లేదని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చట్టంలో స్పష్టంగా ఉన్నది. ప్రాజెక్టుల పూర్తి బాధ్యత డ్యామ్ ఓనర్ దేనని ఆ చట్టం చెప్తుంటే,కాళేశ్వరం విషయంలో డ్యామ్ ఓనర్గా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరిస్తున్నది.

## రాష్ట్ర కొత్త బడ్జెట్ 3.05 లక్షల కోట్లు?

### వ్యవసాయానికి రూ.42 వేల కోట్లు

### ఆరు గ్యారంటీల కోసం భారీ కేటాయింపులు

### 2025-26 వార్షిక బడ్జెట్‌పై కసరత్తు

### రికార్డు స్థాయికి తెలంగాణ వార్షిక అంచనాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఏప్రిల్ నెలతో ప్రారంభమయ్యే 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను రాష్ట్ర వార్షిక అంచనా బడ్జెట్ దాదాపు రూ.3.05 లక్షల కోట్లుగా ఉండే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25 అంచనా బడ్జెట్ రూ.2.91 లక్షల కోట్లుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టగా, ఈసారి అంతకంటే ఎక్కువగా ఉంటుందని ఆర్థిక శాఖ అధికారవర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఇంత భారీ మొత్తంలో బడ్జెట్ ఉండటం విశేషం. ఇదే సమయంలో ఈ బడ్జెట్‌లో వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యతన ఇవ్వనుంది. ఈ మేరకు ఈ కొత్త బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.42 వేల కోట్లు కేటాయించేందుకు కసరత్తు జరుగుతోంది. ఈ మేరకు దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి సమర్పించారు. ఈ మొత్తంలో రైతు భరోసాకు సుమారు రూ.18 వేల కోట్లు, రైతు బీమాకు రూ.1,500 కోట్లు పోను మిగిలిన రూ.20 వేల కోట్లలో ఎక్కువ భాగం వేతనాలు చెల్లింపులకు కేటాయించనున్నట్లు తెలుస్తోంది.నప్రస్తుతం బడ్జెట్ రూపకల్పనలో ఆర్థిక శాఖ నిమగ్నమైంది. మరోపక్క డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్ శాఖల ప్రతిపాదనలపై ప్రీ బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇందుకు అనుగుణంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, అప్పుల కిస్తీలు, వాటి వడ్డీల కింద అధిక నిధులు కేటాయిస్తోంది. ప్రధానంగా ఆరు గ్యారంటీల్లో చేయూత పెన్షన్, మహాలక్ష్మి మ్‌లో స్కీంలో భాగమైన మహిళలకు నెలకు రూ.2,500 పథకాలు అమలు చేసేందుకు అవసరమైన నిధులు కేటాయిస్తోంది. ఏటా రాష్ట్ర ఆదాయం, తలసరి ఆదాయం పెరుగుతూ వస్తోంది. జీఎస్డీపీ కూడా పెరిగింది. నాన్ టాక్స్ రెవెన్యూ మినహా వివిధ శాఖల్లోనూ ఆదాయం ఆశాజనకంగా ఉంది. అదేవిధంగా కేంద్రం నుంచి పన్నుల శాతం పెరగడం, వచ్చే ఏడాది మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నది. రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయం తగ్గలేదు. భూముల అమ్మకాల విషయంలో మినహా మిగిలిన వాటిల్లో ఆదాయం అంచనాకు అనుగుణంగా సమకూరుతోందని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జనవరి చివరి నాటికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన అంచనాలో రూ.1,82,437 కోట్ల ఆదాయం వచ్చింది. అంచనా వ్యయంలో 66.57 శాతం నమోదైంది. గతేడాది కంటే 1.8 శాతం తక్కువగా ఉంది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో కనీసం 15-18 శాతం ఇంకా ఆదాయం వస్తుందని అంచనా వేస్తుండగా, గతేడాది కంటే ఈసారి అధికంగానే ఆదాయం వస్తుందని భావిస్తున్నారు. ప్రభుత్వానికి వచ్చే పన్నులు ఎక్కువగా ఫిబ్రవరి చివరి వారం, మార్చి నెలల్లోనే వస్తాయని తెలుస్తోంది.

## పాఠశాల విద్యలో యేడాదికి 20వేల మెడికల్ బిల్లులు!

### క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ అయితే బాగుంటుందంటున్న అధికారులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందితోపాటు వారి కుటుంబ సభ్యులకు.. పెన్షనర్లకు మెడికల్ బిల్స్‌ను ఇస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగుల్లో ఎక్కువగా ఉన్న శాఖగా పాఠశాల విద్య శాఖ ముందుంటుంది. పాఠశాల విద్యా శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సుమారు 1.08 లక్షల మంది ఉండగా.. కొత్తగా డీఎస్‌సీ-2024లో 10వేలకిపైగా ఉపాధ్యాయులు నియమితులయ్యారు. వారితోపాటు బోధనేతర సిబ్బంది మరో 15వేల నుంచి 20వేల మంది ఉంటారు. వారు కాకుండా పెన్షనర్లు కూడా వేలల్లో ఉంటారు. ఇలా చూస్తే సుమారు 2 లక్షల మంది వరకు మెడికల్ బిల్స్‌ను పొందే అవకాశం ఉన్న శాఖగా పాఠశాల విద్యశాఖ కొనసాగుతోంది. పాఠశాల విద్య శాఖలో మెడికల్ బిల్స్ కోసం ప్రతినెలా సుమారు 1500కి తగ్గకుండా ఫైల్స్ వస్తుంటాయి. ఉపాధ్యాయులు, సిబ్బంది.. వాటి కుటుంబ సభ్యులు.. పెన్షనర్లు కూడా మెడికల్ బిల్స్‌ను ఉపయోగించుకోనున్నారు. ప్రతి నెలా 1500కి పైగా వచ్చే మెడికల్ బిల్లులను అధికారులు ఫైనల్ చేయాల్సి ఉంటుంది. వచ్చిన ప్రతి బిల్‌ను కూడా అధికారులు చూసి మరీ మాన్యువల్‌గా ఫైనల్ చేయాల్సి ఉంటుంది. ఇలా ప్రతి నెలా 1500కిపైగా బిల్స్ వస్తే.. ఏడాదికి సుమారు 18000కి తగ్గకుండా వస్తుంటాయి. ప్రతి ఏడాది సుమారు 20వేలకి తగ్గకుండా మెడికల్ బిల్స్ వస్తుంటాయని అధికారులు చెబుతున్నారు. మెడిల్ బిల్స్ కోసం పాఠశాల విద్య శాఖ ప్రతి నెలా రూ. 6 కోట్ల నుంచి రూ 7 కోట్ల వరకు మెడికల్ బిల్స్ ఖర్చు అవుతున్నాయి. ఇదే విధంగా ఏడాదికి సుమారు రూ. 75 కోట్ల నుంచి రూ. 80 కోట్ల వరకు మెడికల్ బిల్స్ కోసమే ఖర్చు అవుతున్నాయి.

## నకిలీ సర్టిఫికెట్లతో 'వ్యవసాయ' ఉద్యోగాలు!

### ఇద్దరి అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

**గద్వాల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** అగ్రికల్చర్ డిప్లొమా చదవకుండా చదివినట్టు నకిలీ సర్టిఫికెట్స్ పొంది వాటి ద్వారా వ్యవసాయ శాఖలో ఉద్యోగం పొందిన వ్యక్తి, పరీక్షలు వ్రాసిన వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అరెస్ట్ చేసి వారి నుండి నకిలీ సర్టిఫికెట్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గద్వాల పట్టణ పోలీస్ కార్యాలయంలో విలేకరులతో డిఎస్పీ మొగులయ్య మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో నకిలీ సర్టిఫికెట్స్‌లతో ఉద్యోగాలు పొందిన వారి ముద్దాయిల వివరములు తెలిపారు. గద్వాల డిఎస్పి వై.మొగులయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఏ 1 గా కట్రావత్ నరేష్ తండ్రి కట్రావత్ లాల్య, ఇతను ఏఈఓ (అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్) లింగోటం తాండ, గ్రామము అచ్చంపేట మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా, ఏ 2 గా పెరుమళ్ళ నాగరాజు తండ్రి పెరుమళ్ళ నరసింహ, అగ్రికల్చర్, రాయవరం క్యాంపు గ్రామము, లింగాల మండలం నాగర్‌కర్నూల్ జిల్లా, ఏ 3 గా బాలకృష్ణ ప్రిన్సిపల్ మిర్యాలగూడ పట్టణానికి చెందిన ముగ్గురు ముద్దాయి వివరాలు తెలియపరిచారు. నకిలీ సర్టిఫికెట్స్‌ల ద్వారా వ్యవసాయ శాఖలో ఉద్యోగం పొందిన వ్యక్తులుగా 1.నరేష్, 2.జగదీష్, 3.శివ శంకర్, 4.రవీందర్, 5. జెరూపుల డాక్యగా గుర్తించామన్నారు.

వ్యవసాయ శాఖ లో కాట్రవత్ నరేష్ అనే వ్యక్తి డిప్లొమా చదువకుండా నకిలీ డిగ్రి సర్టిఫికేట్స్ పొంది వాటి ద్వారా ఏఈఓ గ్రేడ్ 2 గా సెలక్షన్ అయి, గద్వాల నియోజకవర్గం, గట్టు మండలం, పెంచికలపాడు గ్రామము నందు ఒక సంవత్సరం, మల్దకల్ మండలము నందు ఒక సంవత్సరం డ్యూటీ చేసి




మీడియాతో మాట్లాడుతున్న డిఎస్పీ మొగులయ్య సిఐ, ఎస్సైలు

తర్వాత తనకు డిప్యుటేషన్ పై 2019 మార్చి నెల నందు లింగాల మండలము కోమటికుంట గ్రామానికి బదిలీ పై వెళ్లడం జరిగిందన్నారు. ఇంటలిజెన్స్ డిపార్టుమెంటు వారు తమ విచారణలో సదరు కాట్రవత్ నరేష్ ఏఈఓ గ్రేడ్ 2 తాను డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ ను గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజి గాజీపూర్, ఉత్తర ప్రదేశ్ నందు చదివి పాస్ అయినట్లు సమర్పించిన డిప్లొమా సర్టిఫికేట్ నకిలీది అని, అట్టి కాలేజి నందు డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ బ్రాంచ్ లేదని కమీషనర్ అండ్ డైరెక్టర్ అఫ్ అగ్రికల్చర్, తెలంగాణా ప్రభుత్వానికి తెలిపినట్లు తెలిసినదన్నారు. సదరు కాట్రవత్ నరేష్ నకిలీ సర్టిఫికేట్ సమర్పించి ఉద్యోగమూ లో చేరి తేది 28.01.2017 నుండి 31.12.2023 వరకు ప్రభుత్వమును మోసము చేసి జీతము తీసుకున్నాడన్నారు. నరేష్ తేది 01.01.2024 నాడు జాబు కు రాజీనామా చేశాడని ఈ విషయం పై సిహెచ్ సంగీతలక్ష్మి ఎమ్మెస్సీ అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ గద్వాల వారు గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్ నందు తేదీ 15.03.2024 న దరఖాస్తు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేయగా, నరేష్ తో పాటు, జగదీష్, శివ శంకర్, రవీందర్, జెరూపుల డాక్య మరికొంతమంది ప్రిన్సిపాల్ బాలకృష్ణ కు డబ్బులు చెల్లించి డిప్లొమా చదువకుండా చదివినట్లు నకిలీ సర్టిఫికేట్స్ పొంది వాటి ద్వారా ఉద్యోగాలు పొందినారని, కొంత మంది వాటి ద్వారా ఎగ్జామ్స్ రాసినట్లు తెలిసిందని తేదీ 21.02.2025 న నేరస్తులు అయిన నరేష్ ను పిజెపి క్యాంప్ గద్వాల దగ్గర, నాగరాజు ను అతని గ్రామంలో అదుపులోకి తీసుకొని వారి నుండి నకిలీ అగ్రికల్చర్ డిప్లొమా సర్టిఫికెట్స్‌లను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసామన్నారు. ఇందుకు సంబందించిన మిగతా వారిని పట్టుకొని తరువాత వివరములు తెలియజేస్తాము అని అన్నారు. అగ్రికల్చర్ డిప్లొమా నకిలీ సర్టిఫికెట్లను పొందడానికి ఒక్కొక్క ధ్రువపత్రనికి 90 వేల నుండి 1,20,000 వేల రూపాయలు పెట్టి నిందితులు కొనుగోలు చేసినట్లు డి.ఎస్.పి మొగులయ్య మీడియా ముందు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ లోని, పరిదాపూర్, గాజీపూర్ యూనివర్సిటీ నుండి అగ్రికల్చర్ డిప్లొమా సర్టిఫికెట్లు పొందినట్లు నిర్ధారణకు రావడం జరిగిందని ఇందులో ప్రధానంగా ఉన్న వ్యక్తి నుంచి అన్ని కోణాలలో దర్యాప్తు చేసి మిగతా నకిలీ సర్టిఫికెట్లు పొందిన వారిని కూడా త్వరలో పట్టుకుంటామని విచారణ అనంతరం పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని గద్వాల డిఎస్పి మొగులయ్య అన్నారు. మీడియా సమావేశం అనంతరం నిందుతులను మీడియా ముందు ప్రవేశపెట్టారు గద్వాల పోలీసులు. ఈ కార్యక్రమంలో డిఎస్పి వై.మొగులయ్యతో పాటు గద్వాల సర్కిల్ ఇన్స్పెక్టర్ టంగుటూరు శ్రీను, గద్వాల టౌన్ ఎస్ఐ కళ్యాణ్ రావు తదితరులు ఉన్నారు.

## అదనపు వరి వద్దు

### నీళ్లు ఉంటేనే పంటలు వేసుకోండి

### రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ప్రస్తుత పరిస్థితుల నేపధ్యంలో రాష్ట్రంలో ఈ యాసంగి సీజనులో అదనంగా వరి పంటను సాగు చేయవద్దని రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సూచించారు. హైదరాబాద్లఓ ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో రోజురోజుకూ భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయన్నారు. రైతులు అప్పులు చేసి బోర్లు వేయొద్దని, అలాగే నీళ్ల ఉంటేనే పంటలు వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎండకాలం నీరు లేకుండా పంటలు వేసి నష్టపోవద్దన్నారు. ముఖ్యంగా బోర్లు వేసి అప్పులపాలు కావొద్దని విజ్ఞప్తి చేశారు. రైతులే ఈ దేశానికి వెన్నెముక అన్నారు. అటువంటి రైతుల ప్రాణం చాలా విలువైనదని చెప్పారు.

